

నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ



పార్వతీపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా ఎస్‌వీ మాధవరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విధుల్లో చేరనున్నారు. జిల్లా మూడో ఎస్పీగా నియామకమైన ఆయన నేడు జిల్లాకు రానున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా ఇప్పటివరకు మన్యం ఎస్పీగా పనిచేసిన విక్రాంత్ పాటిల్ బదిలీపై కాకినాడ జిల్లాకు వెళ్లారు.



పార్వతీపురం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

- రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఉప్పొంగుతున్న వాగులు, గెడ్డలు
- పంట పొలాల్లోకి నీరు
- మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం
- ఖరీఫ్ రైతుల్లో చిగురించిన ఆశలు

కురిసింది వాన

పార్వతీపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతన్నకు ఊరటనిచ్చాయి. ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురింపజేశాయి. గత నెలలో జిల్లాలో వర్షాలు అనుకూలంగా ఉన్నప్పటికీ.. ఈ నెలలో ఆ పరిస్థితి లేదు. వరుణుడు పూర్తిగా ముఖం చాటేశాడు. వరి ఎద పంట, నారుమడులు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. నారుమడులను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లుపడ్డారు. ఈ దశలో తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు.. అన్నదాతలకు ఊపిరినిచ్చాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమడులకు పూర్తిస్థాయిలో తడులు అందాయి. వరి ఎద పొలాల్లో నీరు చేరింది. పొలాల్లో వర్షపునీరు చేరడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

వర్షపాతం ఇలా..

జిల్లాలో గత నెలలో యావరేజ్ వర్షపాతం 144 ఎంఎంగా నమోదైంది. ఈ నెలలో వర్షాలు అంతంత మాత్రమే అని చెప్పొచ్చు. యావరేజ్ వర్షపాతం 123 మిలీమీటర్లు ఉండాల్సి ఉండగా 113 మిల్లీమీటర్లుగా నమోదైంది. కాగా ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. మరో రెండు రోజుల పాటు ఇదే విధంగా వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో.. తమ పంటలకు ఢోకా ఉండదని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,77,000 ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా. అయితే ఇప్పటివరకు 16 వేల ఎకరాల్లో ఎదలతో పాటు ఉబాలు పూర్తయ్యాయి. మక్కువ మండలంలో బావులపై ఆధారపడి ఉబాలు పూర్తి చేశారు. పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం, సాలూరు, కొమరాడ తదితర మండలాల్లో ఎద పద్ధతిలో వరిసాగు చేపట్టారు. కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఎదలు వేసుకున్న రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 6,700 ఎకరాల్లో పత్తి, 8,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు పూర్తయింది.

● **గరుగుబిల్లి:** తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో గురువారం వరద ప్రవాహం పెరిగింది. పైనుంచి నదిలోకి 2 వేల క్యూసెక్కులు చేరడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు నీటిని మళ్లిస్తున్నారు. సాగునీరు అవసరార్థం ప్రధాన కాలువల నుంచి కొంతమేర నీటి సరఫరా తగ్గించారు. కుడి ప్రధాన కాలువ నుంచి 350 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ నుంచి 80 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి 30 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథంనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌లు తెలిపారు. ఇదిలా ఉండగా వర్షాల కారణంగా స్పిల్‌వేకు ఆనుకుని ఉన్న కుడి వైపు మట్టికట్ట కోతకు గురికావడంతో పాటు బీటలు వారింది. వర్షాలు మరింతగా కురిస్తే రెండు వైపులా కోతలు అధికమయ్యే పరిస్థితి ఉంది.



వర్షాల కారణంగా బీటలు వారిన తోటపల్లి కుడి మట్టికట్ట

సాగుకు అనుకూలం..

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు.. రైతులకు ఎంతో ఊరటనిచ్చాయి. ఈ వాతావరణం ఖరీఫ్ వరి సాగుకు అనుకూలం. ఈ నేపథ్యంలో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాం.

-రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం మన్యం

ఉద్ధృతంగా నదులు..

భామిని: జిల్లాతో పాటు ఒడిశాలోనూ వర్షాలు కురుస్తుండడంతో వంశధార నదికి గురువారం వరద పోటెత్తింది. సుమారు ఐదు అడుగుల మేర నీరు చేరడంతో ఏరు దాటేందుకు వీలు లేకుండాపోయింది. పడవ ప్రయాణానికి వీలు లేకపోవడంతో ఒడిశా-ఆంధ్రా సరిహద్దు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేరడి సమీపంలో కొందరు అతి కష్టమ్మీద నది దాటుకుని స్వగ్రామాలకు చేరుకున్నారు. నదిలో నీటి మట్టం పెరిగినా.. పడవ ప్రయాణానికి అది సరిపోవడం లేదు. దీంతో ఆయా ప్రాంతవాసులకు అవస్థలు తప్పడం లేదు.



తోటపల్లి స్పిల్‌వే నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం



నేరడిలో వంశధార నది దాటి వస్తున్న ప్రయాణికులు

కోరుకునే విత్తనాలే సరఫరా...

గత ఐదేళ్ల కాలంలో రైతులు కోరుకున్న విత్తనాలను వైసీపీ సర్కారు సరఫరా చేయలేకపోయింది. అయితే ఈ ఏడాది ఆ సమస్యలు లేకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అన్నదాతలు కోరిన విత్తనాలనే సరఫరా చేస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 29,281 క్వింటాళ్ల మేర వివిధ రకాల విత్తనాలు కేటాయించారు. ఇందులో సాధారణ రాయితీపై 19,301 క్వింటాళ్లను కేటాయించగా 90 శాతం రాయితీపై 9,980 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందించారు. వరికి సంబంధించి 26,415 క్వింటాళ్లు, అపరాలకు 243, మిల్లెట్స్‌కు 44, వేరుశనగకు 206, పచ్చిరొట్ట పంటలకు సంబంధించి 2,371 క్వింటాళ్ల చొప్పున విత్తనాలను కేటాయించారు.

సబ్సిడీపై గిరిజనులకు..

జిల్లాలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 16,634 మంది రైతులకు 8,721 క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై అందించారు. సబ్సిడీపై విత్తనాలు అందించడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుష్కలంగా ఎరువులు....

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 4019 టన్నుల ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా, 72 టన్నులను పీఏసీఎస్ ద్వారా సరఫరా చేశారు. ఇంకా మార్క్‌ఫెడ్ వద్ద 883 టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఈ పరిస్థితి లేదు. ఎరువులు కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు వ్యవసాయశాఖ అధికారులపై రాజకీయ ఒత్తిడి తీసుకొని రావడం వల్ల ఎరువులు కొంతమందికే పరిమితమయ్యాయి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రతిరైతుకు వ్యవసాయశాఖ ద్వారా ఎరువులు, విత్తనాలు అందించే విధంగా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

పలుచోట్ల ఇలా..

పార్వతీపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన కూడళ్ల, రోడ్లపై నీరు నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో బుధ వారం నుంచి వర్షం కురుస్తుండడంతో గెడ్డలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరోవైపు జలాశయాలకు వరద పోటెత్తుతోంది. పార్వతీపురంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో బెలగాం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి ప్రధాన రహదారి వరకు వర్షపు నీరు నిలిచిపో యింది. దీంతో పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో లోతట్టు ప్రాంతాలకు చెందిన బైపాస్, జనశక్తి, శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మార్పు సాధ్యం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే సామాజిక మార్పు సాధ్యమని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్యం, విద్య వైద్యం వంటి విషయాల్లో మార్పులు తీసుకురావడానికి ప్రజల భాగస్వామ్యం, మీడియా సహకారం అవసరమన్నారు. అధికార యంత్రాంగానికి, ప్రజలకు మీడియా వారధిగా పనిచేయాలని కోరారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అందరి సహకారం అవసరమన్నారు. జిల్లాలో ఇప్పటికీ పలుచోట్ల బాల్య వివాహాలు జరగడం విచారకరమన్నారు.. మన్యంలో రవాణా సదుపాయాల మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ' సంవత్సర కాలంలో దశల వారీగా రోడ్ల పనులన్నింటినీ పూర్తి చేయడానికి కృషి చేస్తాం. జిల్లాలో రూ.414 కోట్లతో రహదారి పనులు మంజూరయ్యాయి. వన్‌ధన్ వికాస కేంద్రాలు మరింత చక్కగా పనిచేసేలా ప్రణాళిక రూపొందిస్తాం. పది కొత్త కేం ద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించాం. గిరిశిఖర గ్రామాల్లో ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు ఫిల్టరేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. అవకాశం ఉన్న చోట్ల బోర్లు తీయిస్తాం. ట్యాంకర్ల ద్వారా కూడా తాగునీటిని అందిస్తాం. మెడికల్ ఆఫీసర్ స్థాయిలోనే ప్రజలకు పూర్తి వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి నెలా రక్తసేకరణ క్యాంప్‌లు నిర్వహిస్తాం. ' అని ఆయన చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు.. పారిశుధ్య వారోత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. తాగునీటి వనరుల కలుషితం కాకుండా చూడాలని, వాటిని కాపాడుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

వంతెనలు పరిశీలిస్తా...


కొమరాడ మండలంలో మధ్యలో నిలిచిపోయిన పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణంపై కలెక్టర్ స్పందించారు. స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తానని ఆయన తెలిపారు. దానితో పాటు సీతానగరం వంతెన పనులు కూడా వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలి

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. తోటపల్లి, జంఝావతి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ తదితర ప్రాజెక్టులపై ఆయన సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా ఆయకట్టు వివరాలు, కొనసాగుతున్న పనులను వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో మూడు జిల్లాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులు, కాలువలు నిర్వహణకు కొత్త విధానాలు కనిపెట్టాలని, సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చేసే ఇంజనీర్లకు రూ.లక్ష పారితోషకం అందించనున్నట్టు తెలిపారు. కాలువల్లో పూడికతీతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అవసరమైతే యంత్రాలు, నిధులు సమకూరుస్తామన్నారు. ఈ సమావేశంలో జల వనరులశాఖ పర్యవేక్షక ఇంజనీర్ రాజరాజేశ్వరి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా కోటదుర్గమ్మ

పాలకొండ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ గురువారం శాకంబరిదేవిగా దర్శనమిచ్చింది. దాదాపు వేయి కిలోల కాయగూరలు, పండ్లతో ఉత్సవ విగ్రహాన్ని అలంకరించారు. తెల్లవారు జామునుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు.. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం సారె మహోత్సవం సందర్భంగా శాకంబరి దేవిగా అమ్మవారిని చూడడానికి సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తజనం తరలివచ్చారు. తమ ఇష్ట దైవాన్ని దర్శించుకొని తీర్థ ప్రసా దాలు స్వీక రించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.మురళీకృష్ణ, అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.



జరడలో గజరాజులు

● పంటలు ధ్వంసం ● భయాందోళనలో గిరిజనులు, రైతులు

కురుపాం రూరల్, జూలై 18: కురుపాం మండలంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. కొద్దిరోజులుగా గుండాం, పొడిదుం, పటాయి గెడ్డ, జపంరకోటలో సంచరించిన నాలుగు గజరాజులు గురువారం జరడకు చేరుకున్నాయి. దీంతో స్థానికులు హడలిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కొండపోడు పంటలను అవి ధ్వంసం చేశాయి. తాజాగా జరడలో గజరాజులు సంచరిస్తుండడంతో రైతులు, గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పంట, ఆస్తి నష్టం సంభవించకముందే.. సంబంధిత అటవీశాఖాధికారులు స్పందించి.. వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



జరడ పొలిమేరల్లో సంచరిస్తున్న ఏనుగులు

బంగ్లాకు పూర్వ వైభవం

- కూటమి ప్రభుత్వం రాకతో మంచి రోజులు
- ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిల స్థితికి..
- చుట్టూ పొదలతో చిట్టడవిలా ఆవరణ
- రూ.50 లక్షలతో మరమ్మతులకు గ్రీన్‌సిగ్నల్

బొబ్బిలి, జూలై 18: బొబ్బిలి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా గతంలో ఓ వెలుగు వెలిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ ఇతర ఉన్నతాధికారులతో నిత్యం కళకళలాడేది. బొబ్బిలి-పార్వతీపురం స్టేట్‌హైవేకు ఆనుకొని పట్టణ నడిబొడ్డున ఉండడంతో నిరంతరం నేతలు, అధికారులు వచ్చి వెళ్తుండేవారు. అంత కీలకమైన భవనాలకు కొద్దిపాటి మరమ్మతులు చేస్తే చాలు కొత్తగా తయారయ్యేది. ఎందుకో గాని ఆ వైపుగా అధికారులు ఆలోచించలేదు. భవనాలను ఎందుకూ కొరగాని రీతిలో వదిలేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్కరూ ఈ బంగ్లావైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఆవరణం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పాములకు ఆవాసంగా మారి భవనాలు శిథిల స్థితికి చేరాయి. బంగ్లా పరిస్థితిని కూటమి ప్రభుత్వ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చింది. మరమ్మతులు చేసేందుకు నిధులు ఇవ్వడానికి అంగీకరించింది. దీంతో బంగ్లాకు మళ్లీ పూర్వవైభవం రానుంది.

2019 ఎన్నికల సమయంలో ఆర్‌అండ్‌బీ బంగ్లాను రిటర్నింగ్ అధికారి వినియోగించుకున్నారు. ఆ సమయంలో బంగ్లాకు అన్ని హంగులూ సమకూర్చారు. కీలకమైన సమావేశాలు నిర్వహించారు. ఆ తరువాత ఏమైందో ఏమో గాని భవనాలను వదిలేశారు. పూర్తి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోవడం మానేశారు. 1980లో ఈ బంగ్లాను ప్రారంభించారు. అధికారులు, నాయకులు బస చేయడానికే కాకుండా ముఖ్యమైన సమీక్షా సమావేశాలు నిర్వహించేం దుకు, ఇతర అధికారిక కార్యకలాపాలకు బాగా వినియోగించుకునేవారు. ప్రొటోకాల్ బెడద, అతిథులకు ఖర్చులు, బంగ్లా నిర్వహణా ఖర్చులను భరించలేక కొంతమంది అధికారులు ఈ బంగ్లాను ఉద్దేశపూర్వకంగానే వదిలేసినట్లు ఆరోపణలున్నాయి. గత వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఆర్‌అండ్‌బీ బంగ్లా వినియోగంలో లేకపోవడంతో అధికార యంత్రాంగం, వీఐపీలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

● బంగ్లా నిర్వహణ బాధ్యతలను టూరిజం శాఖకు అప్పగించి తద్వారా ఆదాయాన్ని సముపార్జించాలని గతంలో చేసిన ప్రతిపాదనలను వైసీపీ నేతలు అటకెక్కించారు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బొబ్బిలి ఆర్‌అండ్‌బీ బంగ్లాకు కొత్త శోభ ఒనగూడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సక్రమంగా నిర్వహిస్తే బంగ్లా ద్వారా మంచి ఆదాయం వస్తుందని కూటమి నేతలు భావిస్తున్నారు.





శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బీ బంగ్లా భవనాలు

రూ.50 లక్షలతో మరమ్మతులు

ఆర్‌అండ్‌బీ బంగ్లా మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరయ్యాయి. వారంలోగా పనులు చేపడతాం. వాచ్‌మెన్ క్వార్టర్స్ నిర్మాణం, ప్యాచ్‌వర్కులు, కిటికీలు, తలుపులు మార్చడం, రంగులు వేయడం వంటి పనులు చేపడతాం.

- బీవీ రాజు, ఆర్‌అండ్‌బీ జేఈ

జవహర్ నవోదయ విద్యాలయాల్లో
ఆరో తరగతి ప్రవేశాలు



నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశ వ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు.

అర్హత: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తి చేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధ గంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

దిక్సూచి DIKSUCHI


సీఈసీఆర్ఐలో బీటెక్

కరైకుడి(తమిళనాడు)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐ)-బీటెక్ (కెమికల్ అండ్ ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో అదర్ స్టేట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జేఈఈ మెయిన్ 2024 ఆలిండియా ర్యాంక్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఆగస్టు 9
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 21
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** cecri.res.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/NKB5u7vలో చదవండి.

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ పీజీ డిప్లొమా



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(ఈపీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 15 నెలల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్‌లో బ్రేక్ తీసుకోవచ్చు. గరిష్ఠంగా మూడేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌ని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పోర్ట్ విజిట్, ఇండస్ట్రీ విజిట్, రీసెర్చ్ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్స్ ఉంటాయి. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

మ్యాట్ నోటిఫికేషన్

ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)-మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) 2024 ఆగస్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

మ్యాట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అయిదు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఐబీటీ షెడ్యూల్: ఆగస్టు 14న ఎగ్జామ్ రాయాలనుకొనేవారు ఆగస్టు 9లోపు, ఆగస్టు 23న పరీక్ష రాయాలంటే ఆగస్టు 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 11
- **సీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18

పీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 18
- **పీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** mat.aima.in

పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

భారత ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రెగ్యులర్ నాన్ రెసిడెన్షియల్ కోర్సు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రెయినింగ్ పూర్తయ్యేనాటికి అభ్యర్థులకు 18 ఏళ్లు నిండాలి.

- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ccras.nic.in

మరో రికార్డును సాధించిన కల్కి



విడుదలైన మొదటి రోజు నుంచే హిట్ టాక్ తెచ్చుకుని వరుస రికార్డులు సృష్టిస్తోంది 'కల్కి 2898 ఏ.డీ' సినిమా. ఇటీవలే రూ.1000 కోట్లు సాధించిన ఏడవ ఇండియన్ సినిమాగా.. రెండవ ప్రభాస్ సినిమాగా నిలిచింది. ఈ రికార్డుల వేటలో భాగంగా ఈ సినిమా మరో అరుదైన ఘనతను సాధించింది. టికెట్ బుక్కింగ్స్ అప్లికేషన్ 'బుక్ మై షో'లో అత్యధిక టికెట్స్ బుక్ అయిన సినిమాగా ఖ్యాతి గడించింది. 12.15 మిలియన్స్ (దాదాపు రూ.1 కోటి 25 లక్షలు) టికెట్స్ బుక్ అయిన ఈ సినిమా అంతకుమందు 'జవాన్' సినిమా పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. 'జవాన్' 12.01 (దాదాపు రూ.1 కోటి 20 లక్షలు) మిలియన్స్ టికెట్ బుకింగ్స్‌తో ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. కాగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియన్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌లో ప్రభాస్ 'భైరవ' పాత్రలో.. అమితాబ్ బచ్చన్ పురాణ యోధుడు 'అశ్వత్థామ'గా..కమల్ హాసన్, దీపికా పదుకొనే, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రల్లో అలరించారు. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్-2 తెరకెక్కనుందని చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే.



నిన్ను కన్న కనులే


తమిళ చిత్రకథానాయకుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలయ్యాయి. సినిమాలోని రెండో పాట 'నిన్ను కన్న కనులే'ను గురువారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ ఫ్యామిలీ సాంగ్‌ను యువన్ శంకర్‌రాజా, ఎస్పీ చరణ్, చిత్ర పాడారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు ఇతర ముఖ్య తారాగణం. కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్.గణేశ్, ఎస్.సురేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. వెంకట్ ప్రభు దర్శకుడు.



ఘట్టమనేని వంశం నుంచి మరో హీరో

హీరో కృష్ణ మనవడు, నటుడు, నిర్మాత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం పద్మాలయా సంస్థ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో జయకృష్ణ కేక్ కట్ చేశారు. దివంగత రమేశ్‌బాబు సతీమణి, జయకృష్ణ తల్లి మృదుల ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాబు కోసం కొన్ని కథలు విన్నాం. అందరం కలసి ఓ కథను ఎంపిక చేస్తాం. మంచి బేనర్ ద్వారా చక్కని సినిమాతో జయకృష్ణ త్వరలోనే మీ ముందుకు వస్తాడు' అని చెప్పారు. అభిమానులందరికీ జయకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న జాన్వీ కపూర్



బాలీవుడ్ నటి జాన్వీకపూర్ ఇటీవలే 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు. ఓ పక్క వరుస బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూనే.. టాలీవుడ్‌లోనూ ఎన్టీఆర్, రామ్‌చరణ్, నాని సినిమాల్లో కథానాయిక పాత్రను పోషిస్తున్నారీ బ్యూటీ. తాజాగా, ఆమె అనారోగ్యానికి గురయ్యారు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను ముంబైలోని హాస్పిటల్‌లో చేర్చారు. జాన్వీ ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని.. తన కూతురి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడ్డాక ఆమెను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేస్తారని ఆయన చెప్పారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ 'ఉలఝ్' అనే చిత్రంలో నటించారు. ఇందులో ఆమె పోషించే పాత్ర పేరు సుహాన భాటియా. దేశంలో అతి పిన్న వయసులోనే డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎదిగిన సుహాన భాటియా విజయ ప్రస్థానమే ఈ సినిమా కథాంశం. సినిమా ఆగస్టు 2న విడుదలవుతోంది.

దీపావళికి రాకీ రాక




విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంతో రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో విష్వక్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ఖరారు చేశారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'మెకానిక్ రాకీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో విష్వక్‌సేన్ గన్, రెంచ్ పట్టుకొని గంభీరమైన లుక్‌లో కనిపించారు. హైపర్ హర్ష, హర్షవర్ధన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేశ్, విద్యాసాగర్ జె, సినిమాటోగ్రఫీ: మనోజ్ కటసాని, ఎడిటర్: అన్వర్ అలీ

వారం రోజుల ముందుగానే..



రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట్ సత్య రూపొందించారు. తెలుగు, తమిళ భాషల్లో తయారైన ఈ సినిమాలో సంగీర్తన కథానాయిక. ముందు అనుకున్నట్లు కాకుండా వారం రోజుల ముందుగానే అంటే ఈ నెల 26న సినిమాను విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాత ధ్యాన్ అట్లూరి చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. రాధిక శరత్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో చరణ్‌రాజ్, విద్యాసాగర్, రాకెట్ రాఘవ, రఘు కుంచె ఇతర ముఖ్య తారాగణం.

కశ్మీర్ నేపథ్యంలో...



శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అమరన్'. కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్‌పై సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'అమరన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ప్రముఖ జర్నలిస్ట్, రచయిత శివ్ అరూర్ రచించిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' జీవిత గాథ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. కశ్మీర్ నేపథ్యంలో యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సరికొత్త పాత్రలో శివకార్తికేయన్ కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి.

ట్రోలర్స్‌పై డీజీపీకి 'మా' ఫిర్యాదు

సోషల్ మీడియా వేదికల ద్వారా సినిమా తారలపై జరుగుతున్న ట్రోలింగ్‌పై 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) చర్యలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో భాగంగా 'మా' సభ్యులైన శివ బాలాజీ, రాజీవ్ కనకాల, శివకృష్ణ తెలంగాణ డీజీపీ జితేందర్‌ను కలసి వినతి పత్రం అందించారు. అందులో ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్న 250 యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకోవాలని 'మా' సభ్యులు డీజీపీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ.. సైబర్ సెక్యూరిటీ సహకారంతో ఈ అంశంపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని.. అందులో ఇటువంటి ట్రోలర్స్‌పై నిఘా పెడతామని 'మా' సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'మా' సభ్యులు మాట్లాడుతూ "ఈ ట్రోలింగ్స్ హద్దులు దాటిపోయాయి. వీటి వల్ల చాలా మంది నటీనటులు ఇబ్బంది పడుతున్నారు. 24 గంటల్లోపు ఓ ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ట్రోలింగ్ చేసే చానళ్లను గుర్తిస్తాం" అని చెప్పారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి

● అవగాహన ర్యాలీలో న్యాయాధికారులు ● ప్రయాణాల్లో నిర్లక్ష్యం వద్దంటూ సూచన

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని న్యాయాధికారులు సూచించారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. బొబ్బిలి, విజయనగరం, రాజాం, కొత్తవలస, గజపతినగరం, చీపురుపల్లి, పార్వతీపురం, సాలూరులో న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజు సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు.



బొబ్బిలి: ర్యాలీలో న్యాయాధికారులు, కోర్టుసిబ్బంది, పోలీసులు



చీపురుపల్లి: ర్యాలీలో న్యాయాధికారి ప్రేమలత


కురుపాంలో ర్యాలీ



విజయనగరం: మాట్లాడుతున్న న్యాయాధికారి విజయకల్యాణి


రాజాం: ర్యాలీలో న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్


కొత్తవలస: ర్యాలీలో న్యాయాధికారి విజయచందర్


గజపతినగరం: ర్యాలీలో న్యాయాధికారి కనకలక్ష్మి


పార్వతీపురంటౌన్: ర్యాలీలో న్యాయాధికారి దామోదరరావు

ప్రకటనలకే పరిమితం కావొద్దు

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రకటనలకే పరిమితం కాకుండా చూడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య అన్నారు. గురువారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయనగరం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్ర అభివృద్ధికి హామీ ఇచ్చారని, గతంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించారు. సీపీఐ ప్రతినిధులు కామేశ్వరరావు, జాన్సన్‌బాబు, బుగత అశోక్, రంగరాజు, ఎన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

విజయనగరం రూరల్: దేవదాయశాఖ పరిధిలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం ఆయా దేవస్థానాల పరిధిలో జరిగింది. సంతపేట జగన్నాథ స్వామి ఆలయానికి సంబంధించి ఆలయ ఈవో వంశీలక్ష్మీ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 18 వ తేదీ వరకూ హుండీ ఆదాయం 61,384 రూపాయలు వచ్చింది. దాసన్నపేట జగన్నాథ స్వామి ఆలయానికి సంబంధించి హుండీ లెక్కింపులో ఈ ఏడాది రూ. 49 వేల 631 రాగా, గత ఏడాది రూ. 43,362 వచ్చిందని గ్రూపు ఆలయాల ఈవో వంశీలక్ష్మీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

విజయనగరం రింగురోడ్డు: 11 కేవీ పూల్‌బాగ్ ఫీడర్ మీద మరమ్మతులు, లైన్‌కి దగ్గరగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే కార్యక్రమం శుక్రవారం చేపట్టనున్నారని, ఈ నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీ-5 ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, టీడీపీ నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వినుకొండ హత్య రాజకీయ హత్యని ఎంపీ. మిధున్‌రెడ్డిపై దాడి అత్యంత హేయమని అన్నారు. వినుకొండలో తమ పార్టీ కార్యకర్తను అత్యంత పాశావికంగా రాజకీయ హత్య చేసి, దానిని వ్యక్తిగత హత్యగా చిత్రీకరించడం దారుణమని ధ్వజమెత్తారు.

రాయితీపై పప్పు, బియ్యం

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై కందిపప్పు, బియ్యం తదితర వస్తువులు అందిస్తుందని, ఈ కొనుగోలు కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని మండల స్పెషలాఫీసర్ గోవిందరావు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ● **కొత్తవలస:** కొత్తవలస మండల కేంద్రంలో కంది పప్పు, బియ్యాన్ని రాయితే ధరలకే అమ్మేందుకు రెండు విక్రయ కేంద్రాలను గురువారం ప్రారంభించామని తహసీల్దార్ చంద్రశేఖర్, సీఎస్ డీటీ కె.ఇందిర తెలిపారు. కొత్తవలసలోని కొల్లా సత్యానారాయణ షాపు, విన్నకోట చిట్టిబాబు షాపుల్లో విక్రయిస్తారన్నారు.

బొబ్బిలి: జిల్లాలో వినియోగదారులకు కిలో 49 రూపాయలకే సోనామసూరి బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి మధుసూదనరావు తెలి పారు. బొబ్బిలి మండలం మెట్టవలసలో గురువారం నిర్వ హించిన గ్రామసందర్శన కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అధికారి హోదాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 28 కేంద్రాల్లో రూ.160కు కిలో కందిపప్పు చొప్పన విక్రయిస్తున్నట్లు తెలిపారు.

జీపీఎస్ రద్దుపై హర్షం

తెర్లాం: గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ అమలు జీవోను ఉద్యోగుల కోరిక మేరకు రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తెర్లాం యూటీఎఫ్ అధ్యక్షులు గర్భాపు మునిస్వామి, ప్రధాన కార్యదర్శి శంకరరావు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు ఆనందంగా ఉన్నాయని, ఉద్యోగ సంఘనాయకులతో చర్చలు జరిపి మాకు రావాల్సిన బకాయిలను ఇచ్చేవిధంగా చుడాలని వారు కోరారు,

మాజీ సైనికుల కోసం స్పందన కార్యక్రమం

బొబ్బిలి: స్థానిక పాతకోటలో మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో గురువారం జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి కెప్టెన్ సత్యప్రసాద్ బృందం స్పందన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రేవెళ్ల కిరణ్‌కుమార్, ఎ.గోవిందనాయుడు ఆధ్వర్యంలో బొబ్బిలి ప్రాంతానికి చెందిన మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని తమ సమస్యలను అధికారికి నివేదించుకున్నారు. జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి కార్యాలయం సూపరింటెండెంట్ శివ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వారపు సంతలో ఆశీలు వేలం

కొత్తవలస: పలు మార్లు వాయిదా పడుతూ వస్తున్న కొత్తవలస వారపు సంతలో(మంగళవారం) ఆశీలు వసూళ్లకు గాను వేలం పాటను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వేస్తున్నామని ఎంపీడీవో రమణయ్య తెలిపారు. జిల్లా పరిషత్ ఆధీనంలో ఉన్న ఈ సంతకు సంబంధించిన ఆశీలు వేలం పాట మార్చిలో నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా కొద్ది రోజులు, తరువాత తక్కువకు పాటపాడ్డం కారణంగా వాయిదాలు పడింది.

రాజాంవాసులకు రెడ్‌క్రాస్ పురస్కారాలు

రాజాం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ ద్వారా విస్తృతంగా సామాజిక సేవ కార్యాక్రమాలు నిర్వహిస్తున్న రాజాం రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహిత పెంకి చైతన్య కుమార్‌కు శ్రీకాకుళం జిల్లా జేసీ నవీన్‌కుమార్ అవార్డులు అందజేశారు. శ్రీకాకుళంలో జరిగిన రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశంలో రెడ్‌క్రాస్ స్టేట్ ఛైర్మన్ జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో రాజాంకు చెందిన పలువురు ఈ అవార్డులు అందుకున్నారు.

నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

● ఎస్పీ వకుల్ జిందాల్


డీఐజీ గోపీనాథ్ జెట్టీని కలిసిన ఎస్పీ వకుల్ జిందాల్

కొత్తవలస, జూలై 18: జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా కొత్తవలస పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లను సందర్శిస్తామన్నారు. ముఖ్యంగా పోలీసు స్టేషన్ పరిధిలో ఎటువంటి నేరాలు జరుగుతున్నాయనే విషయాలను తెలుసుకుని వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తవలస పోలీసు స్టేషన్‌లో తాను పరిశీలన చేసిన రికార్డులను బట్టి ఇక్కడ ఎక్కువగా యాక్సిడెంటల్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలు జరగడానికి కారణాలేంటి, ఏ ప్రాంతంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయాలను తెలుసుకుని ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తెలిసి, తెలియని వయస్సులో మైనర్ బాలికలు ప్రేమ పేరుతో వెళ్లి పోతున్నారని, ఈ మేరకు తల్లితండ్రులు ఇచ్చే ఫిర్యాదు ప్రకారం ముందుగా మిస్సింగ్ కేసు నమోదు చేయడం తరువాత వారిని కనుగొని తీసుకొచ్చిన తరువాత మైనర్ కాబట్టి ప్రియుడిపై అత్యాచార కేసులు నమోదు చేయడం సాధారణంగా జరుగుతోందని అలా కాకుండా బాలికలకు అవగాహన కల్పించడం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో నేరాలు జరగకుండా విజయనగరం జిల్లాను నేర రహిత జిల్లా తీర్చి దిద్దడం కోసం ప్రణాళికలను తయారు చేస్తున్నట్టు తెలిపారు. ● **విజయనగరం క్రైం:** విశాఖపట్టణం రేంజ్ డీఐజీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోపీనాథ్ జెట్టీని జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్ బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీని అందజేశారు. అనంతరం రేంజ్ అధికారులతో డీఐజీ మమేకం అయి, జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. డీఐజీని కలిసిన వారిలో ఏఎస్పీ అస్మాపరహీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట ఆర్టీసీ డిపో తనిఖీ


డిపోను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపోను గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనాయుడు గురువారం తనిఖీ చేశారు. ఉద్యోగులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రయాణి కులతో మాట్లాడారు. డిపో మేనేజర్ కె.రమేష్, అధికారులు వేణు, కృష్ణారావు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కమిషనర్, వైద్య సిబ్బంది

రాజాం: డయేరియా, డెంగ్యూ, వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడంలో భాగంగా మున్సిపాల్, వైద్య ఆరోగ్యశాఖ కలిసికట్టుగా పనిచేస్తాయని దీనిలో భాగంగా ప్రతిరోజు నాలుగు సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు నంది సూర్య ప్రకాష్‌రావు అన్నారు. గురువారం పురపాలక సంఘం పరిధిలోని తెలగవీధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలో అనేక సమస్యలను కమిషనర్ రామ ప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఈ భాగ్యలక్ష్మి, శానట రీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన తప్పనిసరి

విజయనగరం రింగురోడ్డు: కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్టు ప్రతినిధి తలాడ దీప్తి అన్నారు. గురువారం చెల్లూరు గ్రామంలో లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 18 నుంచి ఆగస్టు 2 వరకూ ఈ వ్యాధిని గుర్తించేందుకు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరిస్తారన్నారు.

జోరువానలోనూ జేఎస్ఎల్ కార్మికుల రిలే దీక్షలు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీలోని జేఎస్ఎల్ కర్మాగారంలో విధించిన లాకౌట్ ఎత్తి వేయాలని కార్మిక సంఘం జేఏసీ నాయకులు కేసురేష్, పి.అప్పలరాజు డిమాండ్ చేశారు. జోరువానలో సైతం మొక్కవోని ధైర్యంతో కార్మికులు రిలే దీక్షలను కొనసాగించారు. కార్మికులు చేస్తున్న ఆందోళనలకు అంగన్ వర్కర్ల సంఘం ఆర్థిక సాయాన్ని ఈసందర్భంగా అందజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరగాలి

బొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. దేవుపల్లి పీహెచ్‌సీని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. దేవుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఏడు సచివాలయాల పరిధిలో 12 మంది గర్భిణులను గుర్తించి సేవలు అందిస్తున్నామని, ఈ నెలలో ముగ్గురు ప్రసవానికి సిద్ధంగా ఉన్నారని వైద్యాధికారి ఎ.శర్మిష్ట తెలిపారు. పూర్తిస్థాయిలో ఆపరేషన్ థియేటర్ లేనప్పటికీ నాలుగు సాధారణ ప్రసవాలు చేశామని వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ వివరించారు. దేవుపల్లి వైద్యాధికారి ఎ.శర్మిష్ట, ఈవో అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విజయనగరం రింగురోడ్డు: పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. ప్రతి గురువారం డివిజన్ పర్యటనలో భాగంగా ఒకటో డివిజన్ ప్రాంతంలో పర్యటించారు. లక్ష్మీ గణపతి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, స్థానికంగా ఉన్న పరిసరాల స్థితిగతులను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలపై పారిశుధ్య కార్యదర్శులకు, ప్రజారోగ్య సిబ్బందిని ప్రశ్నించారు. తక్షణమే సంబంధిత స్థల యాజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజార్యోగ అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, ఎఈలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యపై ఎమ్మెల్యేకి నివేదిక

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని నాలుగుమండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో పరిష్కరించాల్సిన సమస్యలపై అధ్యయనం చేసి ఓ నివేదికను యూటీఎఫ్ నాయకులు గురువారం ఎమ్మెల్యే బేబీనాయనకు అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్రనేత కె.విజయగౌరి ఆధ్వర్యంలో యూటీఎఫ్ నాయకులు బొబ్బిలి కోటలో ఎమ్మెల్యేని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి మండలం కొత్తవలస గిరిజన గ్రామంలో పాఠశాల ఏర్పాటు, రామభద్రపురం మండలం నేరెళ్లవలసలో 1,2 తరగతులకు పాఠశాలకు ఏర్పాటు, యూపీ స్కూల్ అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

గిరిజన యూనివర్శిటీపై దృష్టి పెట్టాలి

● లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే లలిత కుమారి


లోకేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న లలిత కుమారి

కొత్తవలస/శృంగవ రపుకోట, జూలై 18: కొత్తవలస మండలం రెల్లిగ్రామంలో కేంద్ర గిరిజన యూనివర్శిటీని పునప్రారంభిస్తున్న తరుణంలో ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌ను కోరినట్టు శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి తెలిపారు. గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, వివిధ సమస్యలపై వినతిపత్రం అందచేశామన్నారు. కొత్తవలసలో ప్రభుత్వడిగ్రీ కళాశాల ఏర్పాటు, శృంగవరపుకోట మండలంలో కస్తూరిబా పాఠశాల, జామి మండలంలో ఏపీ మోడల్‌స్కూల్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. తాను చేసిన అన్ని ప్రతిపాదనలకు లోకేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కొప్పల వెలమ సాధికారిక సమితి కన్వీనర్ లాలం అర్జునరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెటీఏ రాంప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టల్స్‌లో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

క్రైం: నగరంలోని ప్రైవేట్ హాస్టల్స్ యాజమాన్యం నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ వెంకటరావు హెచ్చరించారు. మహిళల రక్షణ, భద్రతా చర్యల్లో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ప్రైవేట్ హాస్టల్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ యజమానులతో గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరావు మాట్లాడుతు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎస్.ఐ హరిబాబునాయుడు, హాస్టల్స్ యజమానులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యా ప్రమాణాలే లక్ష్యం

రేగిడి: దేవుదళ కేజీబీవలో ఉత్తమ విద్యాప్రమాణాలు లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో గురవారం ఆరో తరగతి విద్యార్థులకు అమలుచేస్తున్న సంసిద్ధత, ఇంటర్ ఒకేషనల్ కంప్యూటర్ సైన్స్ కోర్స్‌లో మిగులు సీట్ల భర్తీపై సిబ్బందితో సమీక్షించారు. ఇంటర్ ఒకేషనల్ కంప్యూటర్ సైన్స్‌కోర్స్‌లో ఈ ఏడాది 40సీట్లకు గాను ఇంకా 10సీట్లు ఖాళీలు ఉండగా, వీటిని భర్తీచేసేందుకు, గ్రామాల్లో డోర్‌టుడోర్ క్యాంపైన్‌చేసి ఖాళీసీట్లు భర్తీచేయాలని ఆమె సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈనెల 28వరకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు, ప్రత్యేక మూల్యాంకనాలు నిర్వహించాలని సూచించారు.

భక్తి శ్రద్ధలతో పీర్ల పండగ


పీర్ల ఊరేగిస్తున్న దృశ్యం

విజయనగరం (ఆంధ్రజ్యోతి)జూలై 18: మొహరం పండుగలో ముఖ్యమైన ఘట్టం పీర్ల పండగను జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. దైవప్రవక్త మహమ్మద్ మనవళ్లు హసన్, హుసేన్‌ల వీరోచిత ప్రాణత్యాగానికి జ్ఞానపకంగా పీర్లను ఊరేగిస్తారు. నగరంలో జామియా మజీద్, అంబటి సత్రం జంక్షన్ మజీద్, బాబామెట్ట ఖాధర్ బాబా దర్గాలో ప్రత్యేక నమాజులు నిర్వహించారు. ఏటీకే-వెలుగు వ్యవస్థాపకులు ఖలీల్‌బాబు నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో ముస్లీం భక్తులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పీర్ల పండగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి పీర్లచావిడిలో ఉన్న పీర్లను ముస్తాబు చేసి, భక్తి కీర్తనలు, నినాదాలు చేస్తూ ఊరేగింపుగా ముస్లింలు పీర్లను ఊరేగించారు.

శాకంబరిగా అమ్మవార్లు

రాజాం రూరల్: ఆషాఢమాసం సందర్భంగా ఇక్కడి గాయత్రి కాలనీలోని వేదమాత గాయత్రి దేవిని శాకంబరిగా గురువారం అలంకరించారు. పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కొత్తవలస: ఆషాఢమాసం గురువారం సందర్భంగా కొత్తవలస పంచాయతీ కుమ్మరి బంజరులోని ముత్యాలమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించారు. అనంతరం దర్శనానికి భక్తులకు అనుమతించారు.

వైద్య సేవలు సక్రమంగా అందకపోవడం దారుణం

● తహసీల్దార్ తీరును తప్పుపట్టిన ఎంపీపీ, వైఎస్ఎంపీపీ
● గరంగరంగా ఎస్.కోట మండల సర్వసభ్య సమావేశం

శృంగవరపుకోట, జూలై 18: గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికీ మలేరియా జ్వరాలు ఉన్నాయి. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదు. మీ నిర్లక్ష్యంతోనే ఓ పసి ప్రాణం పోయిందని గిరిజనులు చెబుతున్నారు. గిరిజన గ్రామాల్లో ఇంతవరకు ఎన్ని సార్లు పర్యటించారు. ఎన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారో వివరాలు చెప్పాలని మండల వైఎస్ఎంపీపీ-1 ఇందుకూరి సుధారాజు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీపీ సండిసోమేశ్వరరావు అధ్యక్షతన శృంగవరపుకోట మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు గిరిజన గ్రామాలకు వెళ్లకపోవడంపై మండిపడ్డారు. ఆసుపత్రికి వచ్చిన రోగికు ట్రీట్‌మెంట్ చేయకుండానే రిఫర్ చేస్తున్నారని అలుగుబిల్లి ఎంపీటీసీ రాయవరపు చంద్రశేఖర్ సభ దృష్టికి తెచ్చారు. ఈ ఆసుపత్రిలో స్కానింగ్ తీయడం లేదని కోఆప్షన్ సభ్యుడు బషీర్ తెలిపారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలతో రోగులు ఎక్కువ మంది వస్తున్నారని, దోమల నివారణకు సహకరించాలని సూపరింటెండెంట్ డాక్టర్ నీల ప్రజా ప్రతినిధులను కోరారు. వీరనారాయణం గ్రామంలో 1బీని మార్చిన వారిపై చర్యలు తీసుకోకపోవడం, ముషిడిపల్లి గ్రామ పరిధిలో లేఅవుట్ యజమానులు డి. ఫారం భూముల్లో, చెరువులో వేసిన రోడ్డును తొలగించకపోవడం, జిందాల్ భూ వివాదాలను తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిష్కరించకపోవడాన్ని ఎంపీపీ సోమేశ్వరరావు, వైఎస్ఎంపీపీ సుధారాజు తప్పుపట్టారు. ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వకపోవడాన్ని అభ్యంతరం తెలిపారు. పోతనాపల్లిలో ఇళ్ల నిర్మాణం చేయకుండానే బిల్లులు చెల్లింపులు జరిగాయన్న సమాచారం వచ్చిందని గృహనిర్మాణ శాఖ డీఈ శ్రీనివాస్‌ను అడిగారు. దర్మవరంలో ఐసీడీఎస్ బిల్డింగ్‌ను ప్రారంభించాలని సర్పంచ్ గాలి సన్యాసయ్య కోరారు. వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ తదితర అధికారులతో పాటు ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్డీ ఐ.వి లక్ష్మి, జడ్పీటీసీ వెంకటలక్ష్మి ఉన్నారు.

బాకీ డబ్బులు అడిగినందుకు వ్యక్తిపై దాడి

పార్వతీపురంటౌన్, జూలై 18: తనకు రావాల్సిన బాకీ డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరినందుకు ఒక వ్యక్తిపై కొంతమంది దాడికి పాల్పడ్డారు. జిల్లా ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాయగడ రోడ్డులో గల కిరాణా వ్యాపారి కె. వైకుంఠరావు, ప్రధాన రహదారిలో గల శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సప్లయర్స్ లైటింగ్ ఏర్పాటుకు సంబంధించి 2 ఏళ్లకు లీజుకు తీసుకున్నాడు. 2024మార్చి 16న గొట్టివలస గ్రామానికి చెందిన వి. గురునాథం కుమారుని పెళ్లికి సప్లయర్స్ లైటింగ్ ఏర్పాటు బకాయికి సంబంధించి అలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి. వెంకటరమణమూర్తి, కె.రాజుతో చర్చ జరిగింది. అయితే ఈ క్రమంలో గురునాథం తరుపున ఉన్న వ్యక్తులకు, కమిటీ సభ్యులకు వాగ్వాదం జరిగి డబ్బులు అడిగిన సప్లయర్ లీజు కాంట్రాక్టర్ వైకుంఠరావుపై దాడికి దిగారు. ఈ దాడిలో వైకుంఠరావుకు తీవ్రగాయాలవ్వడంతో జిల్లా ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. ఔట్ పోస్టులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తేలుకాటుతో రైతు మృతి


కనకనాయుడు (ఫైల్)

గుర్ల, జూలై 18: తేలు కాటుతో రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పున్నపురెడ్డిపేట గ్రామానికి చెందిన పి.కనకనాయుడు(40) వ్యవసాయ పనులతో పాటు తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం అదే గ్రామంలో వ్యవసాయ పనులు నిమిత్తం భార్య కృష్ణవేణితో కలిసి నువ్వులు ఎండబెట్టేందుకు వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో తేలు కుట్టడంతో హుటాహుటిన అక్కడి నుంచి స్థానికులు, కుటుంబీకులు కలిసి గుర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్క డ వైద్యం అందిస్తూ విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. విజయనగరం ప్రభుత్వ మహారాజ ఆసుపత్రిలో వైద్యం పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి ఇద్దరు ఆడప్లిలలు. గత సంవత్సరం పెద్దమ్మాయి అదే పంట పొలంలో విషజంతువు కాటువేయడంతో అక్కడి కక్కడే మృతిచెందింది. ఈ సంవత్సరం అదే పంట పొలంలో తండ్రి మృత్యువాత పడడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోసుమార్టం నిర్వహించినట్టు తెలిపారు.

జ్వరంతో గిరిజన చిన్నారి మృతి


మృతి చెందిన బాలుడు

శృంగవరపుకోట రూరల్ జూలై 18: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ జిల్లెడిలోవకు చెందిన మూడేళ్ల బాలుడు చదరం పోతురాజు జ్వరంతో చనిపోయాడు. పోతురాజుకు కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడని, స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చూపించామని, కాస్తా నయం అయిందని బుధవారం రాత్రి ఇంటికి తీసుకోచ్చమని తల్లిదండ్రులు భీమరాజు, సీత తెలిపారు. అయితే గురువారం ఉదయం ఒక్కసారిగా ఆరోగ్యం విషమించడంతో 108కి ఫోన్‌చేయగా వాహనం వచ్చేలోపే తమ చిన్నారి చనిపోయాడని విలపించారు. దీనిపై డాక్టర్ శిరీష వివరణ కోరగా భీమరాజు కుటుంబం సాలురులో ఉంటోందని, నాలుగురోజుల క్రితం ఆనారోగ్యంతో బాధపడుతున్న బాలుడిని తీసుకోచ్చారని తెలిపారు. వారం రోజుల క్రితం తమ సిబ్బంది గ్రామంలో వైద్యసేవలు అందించారన్నారు. ఈ విషయంపై గిరిజన ఆదివాసి యువత జరత గౌరీష్, శివ, రామన్న, గంగరాజు, అరుణ్‌కుమార్, భీమయ్య తదితరులు మాట్లాడుతూ తమ గ్రామాలకు సరైన వైద్యసేవలు అందక అమాయకపు గిరిజనులు చనిపోతున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విభిన్నప్రతిభావంతురాలిపై అత్యాచారయత్నం

విజయనగరం రింగురోడ్డు: మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షల కోసం వచ్చిన ఓ విభిన్నప్రతిభావంతురాలిపై వార్డు బాయ్ అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయనగరంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వైద్య పరీక్షల కోసం శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరానికి చెందిన ఓ విభిన్నప్రతిభావంతురాలు విజయనగరంలోని గుమ్చీ జంక్షన్ వద్దనున్న ఓ మెడికల్ సెంటర్‌కు గురువారం వచ్చింది. వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా వార్డు బాయ్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించగా ఆమె కేకలు వేస్తూ బయటకు వచ్చేసింది. విషయం బంధువులకు చెప్పగా వారంతా వార్డుబాయ్‌కి దేహశుద్ధి చేసి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌కి తరలించి విచారిస్తున్నారు.

డాక్టర్ సత్యారావుకు పలువురి నివాళి


డాక్టర్ సత్యారావుకు నివాళి అర్పిస్తున్న బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రెడ్డిసత్యారావుకు పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. గౌడవీధిలోని అయన నివాసానికి ఎమ్మెల్యే బేబీనాయన, అయన సోదరుడు మాజీమంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తదితరులు గురువారం విచ్చేసి సత్యారావు భౌతికకాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళర్పించారు. పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు, పెద్దసంఖ్యలో పరామర్శించారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

బొబ్బిలి: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇచ్చిన పిలుపుమేరకు బొబ్బిలి జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి జనసేన భావజాలం పట్ల ఆసక్తి వారందరికీ స్వచ్ఛందంగా సభ్యత్వాలు ఇప్పించారు. ● **రాజాం రూరల్:** రాజాం నియోజకవర్గంలో జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని, ఇందుకోసం అందరం పనిచేయాల్సి ఉందని జనసేన ప్రచారకమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్ బాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇక్కడి పోలిపల్లి పైడితల్లి అమ్మవారి సన్నిధిలో గురువారం పూజలు నిర్వహించి క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి సుజయ్ పరామర్శ

రామభద్రపురం: మండల పరిధిలోని రొంపల్లి ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు భవిరెడ్డి చంద్ర తండ్రి కూర్మారావు మాష్టారు ఇటీవల మృతిచెందడంతో మాజీ మంత్రి, తెలుగుదేశం జోనల్ కోఆర్డినేటర్-2 సుజయ్‌కృష్ణరంగారావు గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, కర్రోతు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు తీరడం లేదు

జామి: గ్రీన్‌ఫీల్డ్‌హైవేపేరుతో మండల కేంద్రం జామి వాసులకు ఉన్న శ్మశానాన్ని రోడ్డులో కలిపేశారని, ఇది జరిగి రెండేళ్లవుతున్నా మండల అధికారులు ఇప్పటివరకు వేరేచోట శ్మశానం కేటాయించకపోవడంతో ప్రజలతో ప్రతిరోజు చీవాట్లు తింటున్నామని మేజర్ పంచాయతీ సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మావాపోయారు. గురువారం మండల ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పంచాయతీలో దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రాంబాయి వెంటనే సమస్య తీరుస్తామని చెప్పడంతో పాటు సమావేశం ముగిశాక పాత శ్మశాన వాటికస్థలం పరిశీలించారు.

ఆంధ్రా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా జిల్లా వాసి


శశిభూషణ్

గరుగుబిల్లి: మండలంలోని కొత్తపల్లికి చెందిన గొట్టాపు శశిభూషణ్ ఆంధ్రా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమితులయ్యారు. ఈయన గత 21 ఏళ్లుగా ఏయూలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఏడాదిగా ఇంజినీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. యూనివర్సిటీలో చేరక ముందు ఎయిర్‌పోర్ట్ అథారిటీలో ఏజీఎంగా విధులు నిర్వహించారు. అలాగే 2014-19 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మక్కువ: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, రైతు భరోసా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. మండలంలోని తూరుమామిడి సచివాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతు భరోసా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే వ్యవసాయ పనులు ప్రారంభవుతున్నా రైతులు ఖాతాల్లో నగదు జమ చేయలేదన్నారు. స్మార్ట్ మీటర్లు పెడతామన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. రైతులకు కౌలు కార్డులు ఇచ్చి రుణాలు అందించాలన్నారు. ఉపాధి వేతనదారులు తక్షణమే బకాయిలు చెల్లించాలన్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. రైతు కూలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దాసు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణం వేగవంతం చేయాలి


ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న రిషివర్ధన్

మక్కువ: మండలంలోని కోదుపెద్దవలసలో పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సాలూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ అన్నారు. గురువారం ఆయన ఆ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. గత ప్రభుత్వం పాఠశాల నిర్మాణానికి రూ.37లక్షలు మంజూరు చేసినా కేవలం పది లక్షలు నిధులు ఇవ్వడంతో పాఠశాల లేక విద్యార్థులు రేకుల షెడ్‌లో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను సక్రమంగా వినియోగించుకుని పాఠశాల నిర్మాణం చేపట్టాలన్నారు. విడుదల కావాల్సిన మిగతా నిధులను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుగుణేశ్వరరావు, నాయకులు రమేష్, బంగా రాజు తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

కురుపాం: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా గురు వారం కురుపాంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా ర్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచా యతీ అధికారి బి.సత్యనారా యణ ఈ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎండీఎం మెనూ పరిశీలించారు. హెచ్‌ఎం టి.శంకరరావు, ఎంపీడీవో అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే విద్యార్థులకు దిక్సూచీలు

పార్వతీపురంటౌన్: విద్యార్థులకు ఉపాధ్యాయులే దిక్సూచిలని ఎంఈవో-2 కె.ప్రసాదరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం పార్వతీపురం, సీతానగరం, కొమరాడ, బలిజిపే మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రత్యేక బోధన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 27వ తేదీ వరకు మండలాల వారిగా ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

కూలిన ప్రహరీ


ప్రహరీ కూలిన దృశ్యం

గరుగుబిల్లి: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సంతోషపురం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రహరీ కుప్పకూలింది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పెట్రోల్ బంకుకు సంబంధించిన ప్రహరీ అధిక మొత్తంలో గురువారం నేలకొరిగింది. గత కొద్ది రోజులుగా బంకు నిర్వహించకపోవడంతో ప్రమాదం తప్పింది. పంట పొలాలకు ఆనుకుని ఉండటంతో బంకుకు ఆనుకుని ఒకవైపు భాగం పూర్తిగా పడిపోయింది. ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు యాజమాన్యం చేపట్టేందుకు దృష్టి సారిస్తున్నారు.

జగన్నాథ హుండీ ఆదాయం నాలుగింతలు


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: పట్టణంలో జగన్నాథ రథోత్సవం ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు. ఈనేపథ్యంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించగా రూ.34వేలు వచ్చాయి. ఏ ఏడాదీ హుండీ ఆదాయం రూ.6వేలు దాటిన సందర్భాలు లేవు. ఈ ఏడాది రూ.34 వేలు దాటడం విశేషం. చీఫ్ ఫెస్టివల్ అధికారి వీవీ నారాయణ, పట్టణ గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాదు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు త్రినాథ పండా, ఆలయ కమిటీ సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు

పార్వతీపురంటౌన్: మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని 30 వార్డుల్లో ఇప్పటికే కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 27వ, 28వ వార్డుల పరిధిలోగల చిన దేవర వీధి, దంగిడి వీధులతో పాటు తదితర వీధుల్లో కాలువల్లో చేపడుతున్న పూడిక తీత పనులను ఆయన గురువారం పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని సంబంధిత ప్రజారోగ్యశాఖ, సచివాలయ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ మురళి పాల్గొన్నారు.

రహదారి నిర్మించండి

పాచిపెంట: కొండమోసూరు జంక్షన్ నుంచి అల్లంపాడు, కొండలుద్దండి మీదుగా మిలియాకంచూరు వరకు రహదారి నిర్మించాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు మూలపాడు గెడ్డ వద్ద కోతకు గురైన రహదారిని చూపిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డప్పు శ్రీనివాసరావు, కోటపర్తి శ్రీనివాసరావు, జన్ని శంకరరావు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మిక్చర్ మిషన్‌ను ఢీకొన్న బస్సు

రాయగడ: గుణుపురం బైపాస్ రోడ్డుపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బైపాస్ రోడ్డు పనుల్లో ఉన్న కాంక్రిట్ మిక్చర్ మిషన్‌ను, గుణుపురం నుంచి గుడారి వెళ్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఓ ప్రయాణికుడు మృతిచెందాడు. పలువురు గాయాలపాలయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే గుణుపురం శాసనసభ్యుడు సత్యజిత్ గొమాంగ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బైపాస్ పనులు జరుగుతున్న రహదారిపై భారీ వాహనాలు తిరుగుతున్న కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బస్సులను పాత గుణుపురం మీదుగా గానీ, ఓవర్ బ్రిడ్జి వీధి గుండా గానీ వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

31 గ్రామాలకు తాగునీటి సౌకర్యం

● మంత్రి సంధ్యారాణి


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాలూరు నియోజకవర్గంలో 31 గ్రామాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కోసం సుమారు రూ.3కోట్ల నిధులు మంజురు చేశామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గురువారం సాలూరులోని తన నివాసంలో ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో విధ్వంసకర పాలన సాగించిందన్నారు. జైకా నిధులు రూ.2వేల కోట్లు మంజురైతే కేవలం రెండు వందల కోట్ల రూపాయలకు యూసీలు గత ప్రభుత్వం చూపించ లేకపోయిందన్నారు. మొదటిగా తన నియోకజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు సంబంధించి 31 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కోసం సుమారు రూ.3 కోట్లు నిధులు తీసుకువచ్చామని తెలిపారు. పాచిపెంట మండలంలో ఉన్న పారమ్మకొండ తల్లి ఆలయం వరకు తారు రోడ్డు నిర్మాణం కోసం రూ.కోటీ 60 లక్షల నిధులు తీసుకొచ్చామని, త్వరలో పనులు మొదలుపెడతామని తెలిపారు. మున్సిపాల్టీలో అధికారులు ఇష్టంగా పనిచేయలని కష్టంగా ఉంటే సెలవుపెట్టి వెళిపోవాలని అన్నారు. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖలో రూ.257కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఎంత మేరకు అప్పులు చేశారో తెలియాల్సి ఉందన్నారు. త్వరలో ఐటీడీఏ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సాలూరు మండలంలో వాటర్‌ఫాల్స్‌కు వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు తిరుపతిరావు, పరమేష్, శోభారాణి, రవికుమార్, యుగంధర్, జనసేన నాయకుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో మంత్రి

సాలూరు పట్టణంలోని స్థానిక శివాలయంలో గురువారం ఉదయం బాలత్రిపుర సుందరి మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి మంత్రి సంధ్యారాణి హాజరయ్యారు. కొడుకు పృధ్వీ, సోదరుడు నాని ఆమె వెంట ఉన్నారు. అలాగే సాయంత్రం గాంధీనగర్ వద్ద మసీదులో పీర్ల పండుగకు హాజరయ్యారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే విజయచంద్ర


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్: ప్రజల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. వెంకమ్మపేట పంచాయతీ పరిధిలో ఉన్న తన నివాసంలో గురువారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు తాగునీరు, సాగునీరు, రహదారులు తదితర సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలు అందించారు. వీటిని పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంబంధిత శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం పట్టణానికి చెందిన పలువురు ఎమ్మెల్యేకు వివిధ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ● **సీతానగరం:** సీతానగరంలో ఏర్పాటు చేసిన పౌర సరఫరాల రిటైల్ దుకాణాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం పంపిణీ చేశారు. రాయితీపై కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలన్నీ దశలవారీగా అమలు

పార్వతీపురం(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అన్న క్యాంటీన్ భవనాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ టీడీపీ కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తూ ముందుకెళ్తుందన్నారు. ఈ పరిశీలనలో మున్సిపాలిటీ అధికారులు, టీడీపీ నాయకులు సీతారాం, వెంకటనాయుడు, వేణు, మధు, అరవింద్, జనసేన నాయకులు అనిల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ


మాట్లాడుతున్న జయకృష్ణ

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం జనసేన పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సభ్యత్వం కార్యక్రమం ప్రతి గ్రామ, వార్డు, పట్టణాల్లో కూడా విజయవంతంగా నిర్వహించాలన్నారు. పేదలకు అండగా ఉండేందుకు ఈ సభ్యత్వం ఉపయోగపడుతుందన్నారు.

చెరువులను కబ్జా చేశారు

నియోజకవర్గంలోని చెరువులను వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కబ్జా చేశారని, ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు ఆక్రమణలకు గురయ్యాయని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. ఎక్కడ కబ్జా జరిగినా వాటి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్‌కు కూడా డబ్బులు లేకుండా చేశారని ఆయన ఆరోపించారు.

ప్రతి బుధవారం జనవాణి

పాలకొండలో ప్రతి బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో జనవాణి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, జానీ, పుండరీ, ఉదయాన ఉదయ్‌భాస్కర్, రామినాయుడు, జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల రిటైల్ దుకాణం ప్రారంభం


సరుకులను అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిటైల్ దుకాణాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా కందిపప్పు రూ.160, సాంబమసూరి బియ్యం కేజీ రూ.40కి అందిస్తున్నామని చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకులు డి.లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్, మండల కన్వీనర్ పాడి సుధా వెంకటరావు, భారతి, కళావతి, లోవరాజు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ప్రారంభం

కురుపాం: సీతంపేట గ్రామానికి గిరిజన ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులు రూ.70లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామస్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఇంజినీరింగ్ శాఖ ఈఈ జి.శాంతేశ్వర రావు, ఎంపీడీవో అప్పారావు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో పి.బావాజీ, టీడీపీ నాయకులు కోలా రంజిత్ కుమార్, డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, పండా సుకేష్ కుమార్, చందక రామకృష్ణ, ఎంపీపీ బి.సురేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కోటి 20లక్షలతో నిర్మించిన కోనగూడ రోడ్డు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ● **కురుపాం రూరల్:** కోనగూడ గ్రామానికి రూ.కోటి 20 లక్షలతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. సుమారు 1,420 మీటర్ల తారురోడ్డును ప్రారంభించినట్టు చెప్పారు.

ఐదేళ్ల పాలనలో అంతా దోపిడీయే..


మాట్లాడుతున్న భూదేవి

సీతంపేట: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో భూదందాలు, సహజ వనరుల దోపిడీ సాగించిందే తప్ప ప్రజలకు ఎటువంటి ఉపయోగకరమైన పథకాలు అమలు చేయలేదని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి ఆరోపించారు. గురువారం సీతంపేటలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ దోపిడీపై ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేసి, ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం ద్వారా ఈ ఐదేళ్ల పాలనలో వైసీపీ చేసిన భూదోపిడీ, అరాచకాలు ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గృహ నిర్మాణశాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను మింగేశారని ఆమె ఆరోపించారు. జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించారన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎంపీటీసీ బిడ్డిక జయలక్ష్మి, వై.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ సవర కుంపి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ మూర మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండండి

వీరఘట్టం: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తుపాన్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు భారీ వర్షాలు కారణంగా కలెక్టర్ ఆదేశాలు మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ జయప్రకాష్ తెలిపారు. మండలంలోని వీఆర్వోలు విడతల వారీగా పర్యవేక్షిస్తారన్నారు. మండలంలో ఎక్కడైనా తుపాను కారణంగా నష్టం జరిగిన వెంటనే సమాచారం అందించాలన్నారు.

పాత బ్రిడ్జికి మోక్షం కల్పించాలి

పాలకొండ: పట్టణంలోని సెగిడి వీధి నుంచి గారమ్మ కాలనీలోకి వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం సగంలోనే వదిలేశారని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షం పడితే గారమ్మ కాలనీలో ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరుతుందన్నారు. దీంతో పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. టీడీపీ, జనసేన నాయకులు బోగాది వెంకటరమణ, సంతోష్‌కుమార్, అనీల్ తన సొంత డబ్బులతో బ్రిడ్జి వద్ద వ్యర్థాలను గురువారం తొలగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా..

సీఆర్టీలకు కౌన్సెలింగ్

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలకు గురువారం పార్వతీపురం ఐటీడీఏలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి పాఠశాలలను కేటాయిస్తూ పీవో విష్ణుచరణ్ ఆదేశాలు జారీ చేశారు. ఏపీవో మురళీ, డీడీ రుక్మండయ్య తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

మక్కువ: వెంకంపేట గ్రామంలో ఓ వ్యక్తి నుంచి అక్రమంగా కలిగి ఉన్న ఐదు లీటర్ల సారాను గురువారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భామిని: భామిని మండలంలో 33 కేవీ మరమ్మతులు చేపట్టడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. జంగిల్ క్లియరెన్స్, మరమ్మతులు ఉండడంతో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు బాలల హక్కుల కమిషన్ చైర్మన్ రాక

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్‌సీపీసీఆర్) చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం పర్యటించనున్నారు. తొలుత కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ శాఖల పాత్రపై నిర్వహించే సమీక్షలో వారు పాల్గొంటారని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ గురువారం తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ వసతిగృహాలు, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను వారు సందర్శించనున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ

సాలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రామాకాలనీకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బలగ రాధపై వచ్చిన అక్రమ వసూళ్ల ఆరోపణపై ఆర్డీవో హేమలత విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారులు భారతి, విజయలక్ష్మితో పాటు, ఆరోపణలు ఎదుర్కొంటున్న బలగ రాధను విచారించారు.

110 మంది ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగ ధ్రువపత్రాలతో విద్యార్థులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని భాస్కర డిగ్రీ కళాశాలలో బుధవారం వివిధ కంపెనీలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించగా 110 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల డైరక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మన్యం జిల్లా పరిధిలో 400 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా వివిధ కంపెనీలకు సంబంధించిన 110 మందికి ఎంపిక చేసి, ధ్రువీకరణ పత్రాలను అందజేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రవిశాస్త్రి, కోఆర్డినేటర్ ఎస్.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గోగు పంట సాగుపై అవగాహన

గరుగుబిల్లి: గ్రామాల్లో గోగు పంట అధిక విస్తీర్ణంలో సాగు చేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ప్రాంతీయ కార్యాలయ అధికారి ఆర్.అరుణ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లాతో పాటు విజయనగరం జిల్లా పరిధిలో గోగుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ జనపనార సంస్థలు గోగుకు కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలుపు రకానికి సంబంధించి రూ.6,035 నుంచి రూ.4,535లు వరకు, మోస్తా రకానికి రూ.4,135ల నుంచి రూ.3,560 వరకు, బీమ్లా రకానికి రూ.4,135 నుంచి రూ.3,560 ధర నిర్ణయించారని వివరించారు. మరిన్ని వివరాలకు పార్వతీపురంలోని ప్రాంతీయ కార్యాలయం, బొబ్బిలి గ్రోత్ సెంటర్, జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాలను సంప్రదించవచ్చని అడిషనల్ డిప్యూటీ మార్కెటింగ్ మేనేజర్ కె.రామ్‌కిరణ్ తెలిపారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

పార్వతీపురంటౌన్: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎస్.మధుకర్ అన్నారు. మన్యం జిల్లాకు విచ్చేసిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మధుకర్ మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. అనంతరం ఆయన్ని ఎమ్మెల్యే విజయచంద్ర కలిశారు. ఆ పార్టీ నాయకులు ఎస్.సంజీవి, పేర్రాజు పాల్గొన్నారు.

వాడవాడలా పారిశుధ్యంపై అవగాహన



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతాల్లో వాడవాడలా పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట రెల్లడుమ్మంగి తదితర గ్రామాల్లో గురువారం పారిశుధ్య కార్య క్రమాలతో పాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా కార్య క్రమాలు నిర్వహించారు. ఈ కార్య క్రమాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు, డ్వా క్రా మహిళలు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● **భామిని:** బత్తిలి మేజర్ పంచాయతీలో పరిసరాల్లో చెత్తా చెదారాలు లేకుండా చూడాలని ఈవోపీఆర్డీ కృష్ణారావు కోరారు. గురువారం పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా బత్తిలి సెంటర్‌లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటేషన్ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **పాలకొండ:** పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా తంపటాపల్లి గ్రామంలో ఎంపీడీవో రామకృష్ణ, ఈవోఆర్డీ సూర్యనారాయణ, డాక్టర్ కమలనాథ్ గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు నిర్వహిస్తున్న పారిశుధ్య వారోత్సవాలను విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. గురువారం మరుపెంట గ్రామంలో పారిశుధ్య వారోత్సవాలు సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుధ్య వారోత్సవాలు విజయవంతమవు తాయన్నారు. సర్పంచ్ ఉరిటి నిర్మల, టీడీపీ నాయకులు కండేన బలరాం నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● **కొమరాడ:** రోగాలు దరి చేరకుండా ఉండాలంటే పారిశుధ్యం మెరుగుపరచాలని టీడీపీ కురుపాం నియోజకవర్గం మహిళా ఉపాధ్యక్షురాలు ఒప్పంగి లావణ్యలత అన్నారు. గురువారం పెదఖేర్జిల గ్రామంలో చినఖేర్జిల గ్రామ సర్పంచ్ హెచ్.గంగాధర్ ఆధ్వర్యంలో పారిశుధ్య వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.


పాలకొండ: తంపటాపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


కొమరాడ: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం